క్లుప్తంగా

రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి



నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలోని ప్రజలకు ప్రభుత్వ సేవలను నిర్ణీత గడువులోగా అందించాల్సిన అవసరం ఉందని డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు సూచించారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాల మేరకు మంగళవారం షాప్ ఎంప్లాయీస్ కాలనీలోని 3వ, 5వ వార్డు సచివాలయాలను పరిశీలించారు. తొలుత సచివాలయ కార్యదర్శుల హాజరు రిజిస్టర్లు, మూవ్మెంట్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. సెక్రటరీలు ప్రజల సమస్యల పరిష్కారంలో అంకిత భావంతో పనిచేయాలని చెప్పారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని, ప్రతి కార్యదర్శి తమ విభాగం ద్వారా మెరుగైన సేవలు అందించాలని కోరారు. ముఖ్యంగా పీజీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులకు సమయానుకూలంగా ఎండార్స్‌మెంట్ ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.

చిన్నారులకు ట్యూషన్ సెంటర్లు ప్రారంభం



లక్ష్మీపురం: స్థానిక విశ్వ మానవ సంక్షేమ సంఘం సహకారంతో గుంటూరు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో ట్యూషన్ సెంటర్లను నగరంలోని స్వర్ణాంధ్రనగర్, పుచ్చలపల్లి సుందరయ్య నగర్, ప్రగతినగర్, పాతగుంటూరులలో మంగళవారం ప్రారంభించారు. విశ్వ మానవ సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు మస్తాన్‌రావు పెసల ప్రారంభించి మాట్లాడుతూ ఇప్పటి వరకు తెలుగు రాష్ట్రాలలో 60 ట్యూషన్ సెంటర్లు ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఖాసీం షహీద్, స్వర్ణాంధ్ర నగర్, పుచ్చలపల్లి సుందరయ్య నగర్, ప్రగతి నగర్ పాత గుంటూరు ట్యూషన్ టీచర్లు శిరీష, కె. సుజాత, ప్రభుకుమార్, తమిమ్ జానీ, నిర్వాహకులు ఆది నికల్సన్, జి.లూథర్ పాల్, పఠాన్ బాషా పాల్గొన్నారు.

రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రంలో పాలన

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రంలో పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, పల్నాడు జిల్లా మహిళా విభాగం ఇన్‌చార్జి బుల్లా మేరీకుమారి మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అత్యంత ఖరీదైన వైద్య విద్యను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఉచితంగా అందించే ఉద్దేశంతో వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలను ఏర్పాటు చేసి, పేద విద్యార్థులకు అండగా నిలిచారని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు తన రాజకీయ చరిత్రలో ఎన్నడూ ఒక్క మెడికల్ కాలేజీ కూడా ఏర్పాటు చేయలేదని ఎద్దేవా చేశారు. మెడికల్ కాలేజీలు రాష్ట్ర ప్రజల ఆరోగ్య భవిష్యత్‌కు చిరునామా అని, అందుకే వైఎస్ జగన్ 17 మెడికల్ కాలేజీలను తీసుకునివచ్చారని వెల్లడించారు. చంద్రబాబు ప్రజల ఆరోగ్యంపై కక్ష కట్టారని, మెరుగైన వైద్యం, వైద్య విద్యను అందుబాటులోకి రాకుండా చేస్తున్నారని విమర్శించారు. మెడికల్ కళాశాలలు ప్రైవేట్ పరం చేసి, వారికి అమ్మేయాలని చూస్తున్నారని ఆరోపించారు.

కెనడీలో హిందీ దివస్



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని కెనడీ ఇంగ్లిష్ మీడియం పాఠశాల మెరిట్ క్యాంపస్‌లో మంగళవారం హిందీ దివస్ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.ఐజాక్ కుమార్ మాట్లాడుతూ జాతీయ భాష అయిన హిందీ ప్రాముఖ్యాన్ని విద్యార్థులు తప్పక తెలుసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మీరాబాయి, కబీర్‌దాస్ పాత్రలతో అలరించారు. అనంతరం నృత్య ప్రదర్శన, హిందీ ప్రాధాన్యం తెలిపే సందేశాలు అద్భుతంగా ఉన్నాయి.

ముఠా కార్మికులకు దసరా బోనస్ ఇవ్వాలి

లక్ష్మీపురం: జిల్లాలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్లలో అనేక సంవత్సరాలుగా ముఠా కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులందరికీ దసరా పండుగ సందర్భంగా దసరా బోనస్ ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రావుల అంజిబాబు విన్నవించారు. గుంటూరు జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్‌కు మంగళవారం ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నంబర్ 14ను, ఈ ఏడాది ఫిబ్రవరి నెల 28వ తేదీ ప్రకారం పెరిగిన బోనస్ రూ.6,500, స్వీట్ బాక్స్‌కు రూ.1500, మూడు జతల యూనిఫాం అలాగే కుట్టుకూలి రూ.2,100 కార్మికులకు అందేలా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని కోరారు.





గుంటూరు నగరంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి మూడు వంతెనల వద్ద భారీగా నీరు రావడంతో ఆగిపోయిన రాకపోకలు



కష్టాల వంతెనలు

మూడు వంతెనలు ప్రజలకు నరకం చూపుతున్నాయి. అల్పపీడనం ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నగరంలో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఓ పక్కన శంకర్‌విలాస్ ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లించారు. దీంతో మూడు వంతెనల వద్ద భారీగా ట్రాఫిక జాం అవుతోంది. వర్షాల కారణంగా వంతెనల కింద నీరుచేరుతుండడంలో ప్రయాణం నరకప్రాయంగా మారింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతినిధులతో కమిషనర్ భేటీ



ప్రతినిధులతో మాట్లాడుతున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: గుంటూరు నగరంలో ప్రతి ఇంటి నుంచి నూరు శాతం చెత్త సేకరణ జరిగేలా 350 ఇళ్లను ఒక మైక్రో ప్యాకెట్ ప్రాతిపదికగా పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్నామని, రానున్న కాలంలో సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి మెరుగైన పర్యవేక్షణ చేయనున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. స్వచ్ఛ సూపర్ లీగ్ సిటీల్లో స్థానం సాధించిన గుంటూరు నగరంలో చేపట్టిన ఉత్తమ విధానాలను అధ్యయనం చేయడానికి ఢిల్లీ నుంచి వచ్చిన స్వచ్ఛ భారత్ మిషన్ ప్రతినిధులు లవ్లీ బన్సాల్, అనిరుధ్ మార్వా, దీపక్ నగరపాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో కమిషనర్‌ని కలిసి తమ పర్యటన వివరాలు తెలిపారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, ఎస్ఈ(ఇన్ చార్జి) సుందరరామిరెడ్డి, డెప్యూటీ కమిషనర్ టి.వెంకట కృష్ణయ్య, ఎంహెచ్ఓ (ఇన్‌చార్జి) రామారావు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్, పర్యావరణ విద్య నోడల్ అధికారి తిరుపతి రెడ్డి, ఐటీసీ నారాయణ పాల్గొన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

నగరంలో చెత్తను రోడ్ల మీద, కాలువల పక్కన, ఖాళీ స్థలాల్లో డంప్ చేయవద్దని, అలా వేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు హెచ్చరించారు. నగరంపాలెం, పాత గుంటూరు, కొత్తపేట తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజారోగ్య కార్మికులు తప్పనిసరిగా ఇంటింటి చెత్త సేకరణ నూరు శాతం చేసేలా వార్డుల వారీగా శానిటేషన్ కార్యదర్శులు మరింత శ్రద్ధతో పర్యవేక్షణ చేయాలన్నారు. ఇప్పటికీ నగరంలో పలు ప్రాంతాల్లో చెత్త డంపింగ్ పాయింట్స్ కనిపిస్తున్నాయని, ఆయా ప్రాంతాల్లో చెత్త పడకుండా సేకరణ చేయడం, నిర్లక్ష్యంగా రోడ్లపై చెత్త వేసే వారిపై అపరాధ రుసుం విధించడం చేయాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం వర్షాల వలన ప్రధాన రోడ్ల మీదకు మట్టి, ఇసుక వచ్చిన ప్రాంతాలను శుభ్రం చేయాలని, ప్రధాన రోడ్ల మీద పని చేసే కార్మికులు తప్పనిసరిగా రేడియం జాకెట్స్ ధరించాలన్నారు. వర్షాలకు ఎక్కడైనా చెట్లు పడి ఉంటే వాటిని తొలగించడానికి చర్యలు తీసుకోవాలని ఏడీహెచ్‌ని ఆదేశించారు.

యానిమేటర్లపై వేధింపులు మానుకోవాలి



డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న యానిమేటర్లు

లక్ష్మీపురం: సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా యానిమేటర్లకు పెట్టిన మూడు సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని, తెనాలిలో వేధింపులు మానుకోవాలని యానిమేటర్ల యూనియన్(సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ కోరారు. యూనియన్ ఆధ్వర్యంలో డీఆర్‌డీఏ కార్యాలయం మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు వేతనాలు పెంచాలని కోరారు. ప్రభుత్వాలు మారినప్పుడు రాజకీయ కారణాలతో తొలగించే సంస్కృతి విడనాడాలని విన్నవించారు. యానిమేటర్లకు బర్రెలు, గొర్రెలు, కోళ్లు, విత్తనాలు అమ్మాలనే టార్గెట్ ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనేకమంది పేదలకు సొంత ఇళ్లు కూడా లేని పొదుపు సంఘం సభ్యులకు ఇవి అంటగట్టడం వలన లక్షాధికారులు కావడం కన్నా ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తెనాలిలో మంత్రి భార్య యానిమేటర్లపై అధికార పెత్తనం చలాయిస్తూ ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆరోపించారు. గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. ధర్నా అనంతరం డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లా అధ్యక్షులు పద్మ, జ్యోతి, విజయలక్ష్మి, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహాలుగా సమాచార కమిషన్లు

లక్ష్మీపురం: ప్రారంభంలో శక్తి వంతమైన శాసనంగా పేరు గాంచిన సమాచార హక్కు చట్ట స్ఫూర్తిని కాల రాసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని విధాల ప్రయత్నిస్తున్నాయని, సమాచార కమిషన్లను ఉత్సవ విగ్రహాలుగా మార్చి వేశాయని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు. గుంటూరు అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం సమాచార హక్కు చట్టంపై సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అధికార రహస్యాలంటూ దస్త్రాల్లో ఉన్న వివరాలను పాలకులు జనం దగ్గర దాచేయకుండా చూడటానికి రెండు దశాబ్దాల కిందట సమాచార హక్కు చట్టం ఆర్టీఐలో అక్రమాలలో ఆరితేరిన ఎందరో పెద్ద మనుషుల ముసుగులనూ ఆ చట్టం తొలిగించిదన్నారు. కేంద్ర రాష్ట్రాల సమాచార కమిషన్ల పరిధిలో 2024 జూన్ నాటికి 4.05 లక్షల కేసులు పెండింగ్‌లో ఉండడంపై ఆందోళన వ్యక్తం చేశారు.

ఓ వ్యక్తి పై కర్రతో దాడి

లక్ష్మీపురం: ఓ వ్యక్తిపై కర్రతో దాడి చేసిన ఘటన పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. శారదాకాలనీ ప్రాంతానికి చెందిన జెట్టి ప్రసన్న కుమార్, ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తుంటారు. అదే ప్రాంతానికి చెందిన లక్ష్మణ్ అరండల్‌పేట 1వ లైన్‌లో బుక్ షాప్‌లో పని చేస్తుంటాడు. వీరువురి మధ్య పాత తగాదాలు, చిన్నపాటి మనస్పర్థలు ఉన్నాయి. అయితే సోమవారం రాత్రి జెట్టి ప్రసన్న కుమారుడితో కలిసి ద్విచక్రవాహనంపై అరండల్‌పేట 1వలైన్ మీదుగా వెళుతున్న సమయంలో లక్ష్మణ్ చూసి ప్రసన్నను అడ్డగించి తనను ఎందుకు తిట్టావని నిలదీశాడు. దీంతో లక్ష్మణ్ ప్రసన్నను బూతులు తిట్టి కర్రతో దాడి చేసి గాయాలు పాలు చేశాడు. దీంతో సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు చేరుకుని లక్ష్మణ్‌ను అదుపులో తీసుకున్నారు. గాయాలు పాలైన ప్రసన్నను ఆసుపత్రిలో చికిత్స పొంది పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఓజోన్ పొర పరిరక్షణకు చర్యలు తీసుకోవాలి



విజేతలతో ఆచార్య బ్రహ్మాజీరావు, కేవీ బ్రహ్మం, కామేశ్వరశాస్త్రి

గుంటూరు ఎడ్యుకేషన్: ఓజోన్ పొర రక్షణ బాధ్యత అందరిపై ఉందని, మానవులతో సహా సమస్త ప్రాణులు ఆరోగ్యకరంగా ఉండాలంటే ఓజోన్ పొర పరిరక్షణ చాలా అవసరమని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ పర్యావరణ విభాగ ఆచార్యులు పి.బ్రహ్మాజీరావు పేర్కొన్నారు. మంగళవారం ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవం సందర్భంగా ఏఎన్‌యూ అంతర కళాశాలల స్థాయిలో పవర్ పాయింట్ ద్వారా వక్తృత్వం పోస్టర్ ప్రజెంటేషన్ పోటీలను కళాశాల వృక్ష, జంతు, రసాయన శాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆచార్య బ్రహ్మాజీరావు మాట్లాడుతూ మనం పసి పిల్లలను జాగ్రత్తగా చూసుకుని సంరక్షించుకునే విధంగానే ఓజోన్ పొరను అంతే జాగ్రత్తగా పరిరక్షించుకోవాలని చెప్పారు. కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం మాట్లాడుతూ విద్యార్థులు ఓజోన్ గురించి పూర్తిగా తెలుసుకోవాలని, తద్వారా ఓజోన్ విలువ తెలిసి బాధ్యతగా వ్యవహరిస్తారని అన్నారు. అనంతరం ఆయా పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జ్ఞాపిక, ప్రశంసాపత్రాలు అందజేశారు. వక్తృత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పోటీల్లో ఎ.స్వరాజ్య లక్ష్మి(టీజేపీఎస్ కళాశాల), పి.జయశ్రీ (సిమ్స్ కళాశాల), కె.భాగ్య రేఖ (జేకేసీ కళాశాల), కె.స్రవంతి(సెయింట్ ఆన్స్ కళాశాల), పోస్టర్ పెయింటింగ్ పోటీల్లో ఎస్‌కే నజ్నీన్(టీజేపీఎస్ కళాశాల), ఎం.అనూష(విజ్ఞాన్ డిగ్రీ కళాశాల), జి.నవ్య శ్రీ (సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల), కె.వినయ్ చరణ్(సిమ్స్ కళాశాల) విద్యార్థులకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలతో పాటు కన్సొలేషన్ బహుమతులు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, వృక్ష, జంతు, రసాయన శాస్త్ర విభాగాధిపతులు పీఎస్ఎల్ చంద్రిక, జమ్రుద్‌బేగం, బి.జ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళీధర్, గుంటూరు జిల్లా జాతీయ సేవా పథకం నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ పాల్గొన్నారు.

క్రీడాపోటీలకు ఎంపికైన పులిపాక హైస్కూల్ విద్యార్థులు



విద్యార్థులతో హెచ్ఎం రమణయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్క్వాష్ గేమ్ జిల్లా ఎంపికల్లో పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీవీ రమణయ్య తెలిపారు. బీఆర్ స్టేడియం ఎదుట ఉన్న శ్రీపులిపాక కమలా హనుమంతరాయ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం రమణయ్య మాట్లాడుతూ బీఆర్ స్టేడియంలో నిర్వహించిన అండర్- 14, 17, 19 బాల, బాలికల ఎంపికల్లో భాగంగా అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి షేక్ సుఫియాన్, అండర్-17 బాలికల విభాగంలో టెన్త్ విద్యార్థినులు మాయర్ రాఫత్, షేక్ సమీర జిల్లా జట్లకు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బి.వెంకటేశ్వరరావు, కేవీ రమణబాబు పాల్గొన్నారు.

దివ్యాంగులకు జీజీహెచ్‌లో ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలి



గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో దివ్యాంగులకు వసతులు కల్పించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ధూపాటి రమణయ్య కోరారు. గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ యశస్వి రమణకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రమణయ్య మాట్లాడుతూ సదరం సర్టిఫికెట్ నిర్ధారణ పరీక్షలకు వచ్చే దివ్యాంగులకు వీల్ చైర్లు, కుర్చీలు, మంచినీటి సౌకర్యం కల్పించాలని కోరారు. సూపరింటెండెంట్‌ను కలిసిన వారిలో రాష్ట్ర అధ్యక్షుడు షేక్ కాలేషా, బత్తుల సాయికుమార్, రవి ఉన్నారు.

అక్టోబర్ 4 నుంచి ప్రపంచ అంతరిక్ష వేడుకలపై పోటీలు



గుంటూరు ఎడ్యుకేషన్: ప్రపంచ అంతరిక్ష వేడుకల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర, సాంకేతిక మండలి, గుంటూరుకు చెందిన సుగుణ సైన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు అక్టోబర్ 4వ తేదీ నుంచి 10 వరకు డ్రాయింగ్, వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించనున్నట్లు సుగుణ సైన్స్ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ చివుకుల సాంబశివరావు తెలిపారు. మంగళవారం బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, సుగుణ సైన్స్ అకాడమీ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పత్రి వేణుగోపాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాల్గొనాలని కోరారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పాఠశాలస్థాయి, జిల్లాస్థాయిలో పోటీలు ఉంటాయని తెలిపారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ నిర్వహణపై శిక్షణ

నెహ్రూనగర్: ఆంధ్రప్రదేశ్ వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్‌ప్రెన్యూర్‌ను తయారు చేయాలనే ఉద్దేశంతో మహిళలకు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై శిక్షణ తరగతులను డీఆర్‌డీఏ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సెర్ప్ ఎల్‌హెచ్ డైరెక్టర్ శివశంకర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్ఎంఈ) కార్యక్రమంలో భాగంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. దీని ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ సంస్థల అభివృద్ధికి, ఆర్థిక సహాయం, సామర్థ్య నిర్మాణం, మార్కెటింగ్ పద్ధతిలో పోటీతత్వాన్ని పెంపొందించడానికి దోహదపడుతున్నారు. అంతే కాకుండా మహిళలకు ఈ స్కీం ద్వారా 35 శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, నాబార్డ్ డీడీఎం శరత్, డీఆర్‌డీఏ పీడీ టి.వి.విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఎంఎస్ సుబ్బులక్ష్మికి నివాళి

లక్ష్మీపురం: భారతీయ సంగీత వినీలాకాశంలో ఒక ధ్రువ తారగా వెలిగిన సంగీత సామ్రాట్ ఎంఎస్ సుబ్బులక్ష్మి అని అవగాహన సంస్థ సభ్యులు వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు అన్నారు. గుంటూరు అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పాడుదాం రండి బృంద సభ్యులు సమక్షంలో జయంతి నిర్వహించారు. తొలుత ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. గాయని యార్లగడ్డ లక్ష్మి పాల్గొన్నారు.

సంజీవయ్య నగర్ రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ జాం



నెహ్రూనగర్: సంజీవయ్య నగర్ రైల్వే గేట్ వద్ద మంగళవారం రాత్రి పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి. శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణ పనులు నేపథ్యంలో వాహనాలన్నీ మూడు వంతెనలు మీదుగా రాకపోకలు సాగించడంతో అక్కడ పెద్ద ఎత్తున వాహనాలు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నాయి. మూడు వంతెనలు మీదుగా ట్రాఫిక్ తప్పించుకునేందుకు వాహనదారులు సంజీవయ్య నగర్ రైల్వే గేట్ మీదగా కొత్తపేట, అమరావతి రోడ్డు, అరండల్‌పేట వెళ్లేందుకు వందలాదిగా వాహనాలు రావడంతో పాటు రైలు రాకపోకలు రాత్రి సమయంలో ఎక్కువగా ఉండటంతో గేటు వద్ద ఇబ్బందులు పడుతున్నారు. దీంతో వాహనదారులంతా గంటల తరబడి సంజీవయ్య నగర్ రైల్వే గేట్ వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.

సుప్రీం తీర్పును స్వాగతిస్తున్నాం

ఆవాజ్ రాష్ట్ర కమిటీ అధ్యక్షులు చిష్టి

లక్ష్మీపురం: వక్ఫ్ చట్ట సవరణ 2025 అంశంలో సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్లు ఆవాజ్ రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ అబ్దులా చిష్టి పేర్కొన్నారు. గుంటూరు కమిటీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు కొన్ని కీలక సెక్షన్లను తాత్కాలికంగా నిలిపివేయడాన్ని ఆవాజ్ కమిటీ స్వాగతిస్తుందన్నారు.